
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 11 ఏప్రిల్ 2025


ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.8
కనిష్ఠం 21.2

ప్రజాశ్రేయస్సుకు పాటుపడేది బీజేపీ


7



అరకొర పెంపుతో అసంతృప్తి!

నామమాత్రంగా ఉపాధి కూలి పెంపు

గతేడాది రూ.28.. ఈసారి 7 రూపాయలే.. ఉపాధి పనులపై కూలీల అనాసక్తి
ప్రైవేట్ పనులకు వెళ్లేందుకే మొగ్గు.. రెండేళ్లుగా అందని వేసవి భత్యం

కేంద్రం ఉపాధి కూలి అరకొరగా పెంచడంపై కూలీలు పెదవి విరుస్తున్నారు. గతేడాది రూ.28 పెంచితే ఈసారి కేవలం రూ.7 పెంచడంతో పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా కొలతలు చూసి కూలి చెల్లిస్తుండటంతో గిట్టుబాటు కావడం లేదని కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే వేసవి భత్యం కూడా చెల్లించకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లి ఉపయోగం లేదని వాపోతున్నారు. దీంతో అధిక శాతం మంది ప్రైవేట్ పనులు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

మొత్తం జాబ్ కార్డులు	1,59,172
యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య	97,328
పనిచేస్తున్న కూలీలు	13,773
ఈ ఏడాది పనిదినాల లక్ష్యం	27,49,112
గతేడాది పనిదినాల లక్ష్యం (2024-25)	21,12,348
పూర్తిచేసిన పనిదినాలు	24,21,926
వెచ్చించిన బడ్జెట్	రూ.59.54 కోట్లు
వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు	4,063
గతేడాది సగటు వేతనం	రూ.246



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు ఈసారి నామమాత్రంగానే కూలి పెరిగింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా తక్కువే. 2024-25లో రూ.28 పెంచిన కేంద్రం.. ఈ సారి కేవలం రూ.7 మాత్రమే పెంచడం పట్ల కూలీలు అసంతృప్తితో ఉన్నారు. గత ఏడాది పెంపులో నాలుగో వంతు కంటే తక్కువ కావడంతో నిరుత్సాహంగా ఉన్నారు. గత ఏడాది పెంచిన విధంగా ఈసారి కూడా కూలి పెంచాలని కోరుతున్నారు. వలసలను నివారించాలి.. పనిలేని వారికి పని కల్పించాలి... ఏడాదిలో కనీసం వంద రోజుల ఉపాధి కల్పించాలని.. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని పారదోలాలనే సంకల్పంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ పథకం కోట్లాది మందికి కరువుకాలంలో ఉపాధి వనరుగా నిలిచింది. ఉపాధిహామీ పథకంలో కూలి రేటును ప్రతిఏటా కేంద్రం పెంచుతుంది. ప్రస్తుతం రూ.300 ఉన్నదాన్ని రూ.307కు పెంచింది. అయినప్పటికీ కూలీలు

మిగతా 8వ పేజీలో...

లక్ష్మీదేవిపల్లి నిర్మాణం పూర్తి చేస్తా

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతా..
అదే నా చిరకాల స్వప్నం
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

షాద్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలన్నదే నా కల అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లో..

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యేగా ఏడాదిన్నర పూర్తి చేసుకున్నందుకు ఎలా ఫీల్ అవుతున్నారు.

ఎమ్మెల్యే: చాలా ఆనందంగా ఉంది. ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న.

ఆంధ్రజ్యోతి: షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు?

ఎమ్మెల్యే: రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్, పాత జాతీయ రహదారి పునరుద్ధరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర పనుల కోసం రూ.700 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి ఏమిటి ?

ఎమ్మెల్యే: గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వలేదు. ముందుగా అవి కాంట్రాక్టర్లకు చెల్లించేలా చర్యలు తీసుకున్న. తద్వారా పెండింగ్‌లో ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణ, 100 పడకల ఆస్పత్రి, సీసీ, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తెచ్చాం. అలాగే చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.184 కోట్లు మంజూరు చేయించాను.

ఆంధ్రజ్యోతి: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయడం లేదన్న విమర్శలున్నాయి?

ఎమ్మెల్యే: గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదన్నది వాస్తమే. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.20కోట్లు ఖర్చు చేశాం. నిధులను దారిమళ్లించే ప్రసక్తే లేదు.

ఆంధ్రజ్యోతి: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ మాటేమిటి..?

ఎమ్మెల్యే: తప్పకుండా.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేయడం నా కల. రెండేళ్లలో భూసేకరణ పూర్తి చేస్తాం. వచ్చే శాసనసభ ఎన్నికల వరకు రిజర్వాయర్ పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలన్నదే నా అభిమతం.

ఆంధ్రజ్యోతి: మీరు చేపట్టిన పనులన్నీ బీఆర్ఎస్ హయాంలో మంజూరయ్యాయని ఆరోపణ?

ఎమ్మెల్యే: పేపర్ల మీద మంజూరు చేసినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లా?. బీఆర్ఎస్ పార్టీ నేతలు చేపట్టిన పనులకు డబ్బులు చెల్లించకుండా కాంట్రాక్టర్ల పొట్టలు కొట్టారు. గతంలో మంజూరై వెనక్కి వెళ్లిన 400పనులను తిరిగి మంజూరు చేయించాం. వాటికి కూడా త్వరలోనే నిధులు మంజూరవుతాయి.

ఆంధ్రజ్యోతి: అభివృద్ధి పనులు ఇంకా ఏం చేపడుతున్నారు?

ఎమ్మెల్యే: కొత్త మండలాలైన నందిగామ, చౌదరిగూడలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించాం. ఇంకా చాలా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ఎప్పటిలోగా పూర్తవుతుంది?

ఎమ్మెల్యే: ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. రెండేళ్లలో పూర్తవుతుంది. షాద్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి నిధులు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం వద్ద నిధులు లేకనే దాతల సహకారంతో జూనియర్ కళాశాల నిర్మిస్తున్నారని ఆరోపణ?

ఎమ్మెల్యే: ప్రతి దానికి ప్రభుత్వం మీదే ఆధారపడాల్సిన అవసరం లేదు. దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మిస్తే తప్పేంటి?. బీఆర్ఎస్ హయాంలో అప్పులు తప్పితే అభివృద్ధి లేదు. ప్రజాప్రతినిధులు పేదల సంక్షేమానికే పాటు పడాలి తప్ప విమర్శలు చేయరాదు.

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కాషాయం పార్టీ

ఆ పార్టీ నిజస్వరూపాన్ని ఎండగట్టేందుకే కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర
గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి
సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలకు వివరించి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లులోని కళ్యాణి గార్డెన్‌లో గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, కార్యక్రమ జిల్లా కో-ఆర్డినేటర్ ఏనుగు జంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు గ్రామాల్లో గడప గడపకు

మిగతా 8వ పేజీలో...


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కు.ని. ఆపరేషన్లు చేయడంలో నిర్లక్ష్యం తగదు

» డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కు.ని. ఆపరేషన్లు చేయడంలో డాక్టర్లు నిర్లక్ష్యం చేయవద్దని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ మహిళకు ఏడాది క్రితం ఇదే ఆసుపత్రిలో కు.ని. ఆపరేషన్ చేశారు. ఆ మహిళకు ఎక్టోపిక్‌ప్రెగ్నసీ వచ్చి కడుపు నొప్పి రావడంతో మళ్లీ అదే ఆస్పత్రిలో చేరింది. ఆమెకు గతంలో వైద్యం చేసిన డాక్టర్లు మళ్లీ కు.ని. ఆపరేషన్ చేశారు. ఇందుకు చార్జీలు కూడా వసూలు చేశారు. దీనిపై ఆమె బంధువులు జిల్లా వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో డీఎంహెచ్‌వో గురువారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. కాన్పుల గదిని మరింత మెరుగు పరచాలని వైద్యులను ఆదేశించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఒక్కోసారి విఫలమవుతాయని డీఎంహెచ్‌వో ఈ సందర్భంగా చెప్పారు. ఆసుపత్రిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత మహిళకు న్యాయం చేస్తామని వెల్లడించారు.

ఫార్మా భూముల సర్వేపై ప్రత్యేక దృష్టి

పనుల తీరుపై కలెక్టర్, టీజీఐఐసీ అధికారుల ఆరా
భారీ పోలీస్ బందోబస్తు మధ్య సాగుతున్న పనులు

హద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ ఏర్పాటుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ

యాచారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యాచారం, కందుకూరు మండలాల మధ్య ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో హద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ బిగింపు పనులపై ఉన్నతాధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. రాష్ట్ర నిఘా విభాగం డీజీపీ బత్తుల శివధర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాష్ట్ర టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్‌కుమార్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబులు ప్రతీరోజు సర్వే పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో, ఏసీపీలతో పాటు నిఘా విభాగం పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇటీవల మేడిపల్లిలో రైతులతో పర్యావరణ వేత్త కవుల సరస్వతి నిర్వహించిన సమావేశం గురించి అధికారులు ఆరా తీశారు. అంతేకాకుండా మేడిపల్లిలో

మిగతా 8వ పేజీలో...


అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు (ఫైల్)


మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

మాకు న్యాయం చేయండి



మేము తాతముత్తాతల కాలం నుంచి ఈ భూములపై ఆధారపడి బతుకుతున్నాం. ఈ భూములకు సంబంధించి మా వద్ద ఎలాంటి పత్రాలు లేవు. వీటిల్లో అధికారులు హద్దులు నాటి చదును చేస్తున్నారు. అధికారులు ఫెన్సింగ్ వేస్తే సాగు చేసుకోలేం. మాకు కూడా కొంత సాయం చేసి అధికారులు ఆదుకోవాలి.

శ్రీనివాస్, రైతు, పల్లెచెల్కతండా

పరిహారం అందించి ఆదుకోవాలి

సర్వే పనులను అడ్డుకున్న గిరిజన రైతులు
పత్రాలు లేకుండా పరిహారం ఎలా ఇస్తారన్న తహసీల్దార్
8

గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

» 53 జీవాలు మృతి



చేవెళ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మందపై వీధి కుక్కల దాడిలో 53 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ బాలయ్య తన వద్ద ఉన్న 75 గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గొర్రెలను మేపుకుని గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న తన పొలం వద్ద మందను ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి వరకు బాలయ్య గొర్రెల వద్దనే కాపలా ఉన్నాడు. జ్వరం రావడంతో అర్ధరాత్రి 2 గంటల సమయంలో బాలయ్య ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఎనిమిది వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బాలయ్య మంద వద్దకు వచ్చి చూడగా గొర్రెల అరుపులు వినిపించాయి. లోపలికి వెళ్లి గొర్రెలపై కుక్కల దాడిని గుర్తించాడు. కర్రతో కుక్కలను కొట్టేందుకు వెళ్లగా అతనిపై దాడి చేసేందుకు యత్నించాయి. చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిచి అక్కడి నుంచి కుక్కలను తరిమేశాడు. ఈ దాడిలో మొత్తం 53 గొర్రెలను కుక్కలు చంపినట్లు గుర్తించారు. దీంతో కాపరి బాలయ్య ఆయన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నాడు. చేవెళ్ల మండల పశువైద్యాధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. చనిపోయిన గొర్రెలను జేసీబీతో గుంత తీసి పాతిపెట్టారు.



చల్లని తాటి ముంజలు

7

ఎండల్లో తక్షణ ఉపశమనం
ఆరోగ్యానికి ఎంతో మేలు
ఆమనగల్లులో అమ్మకాల జోరు

మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల / షాబాద్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి అన్నారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం చేవెళ్ల, షాబాద్ మండలాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాల వద్ద కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోడీ 11ఏళ్ల పాలనలో దేశంలోని ప్రజాస్వామిక వాదుల మీద, ప్రశ్నించే నాయకుల మీద దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా వామపక్ష నాయకుల మీద దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల మీద బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ.. సరైన ప్రాధాన్యమివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, జంగయ్య, నాయకులు మగ్బూల్, మండల మహిళా అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.


చేవెళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో

యాచారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పంట పొలాల మధ్యన ఫాంపాండ్స్ తవ్వుకోవాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి రైతులను కోరారు. గురువారం మండలంలోని మాల్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. ఫాం పాండ్స్ తవ్వితే వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టం పెరుగుతుందని తెలిపారు. దీంతో బోర్లు, బావుల్లో నీటి లభ్యత ఎక్కువుంటుందని చెప్పారు. ప్రతి కూలీకి వారవారం వేతనాలందేలా తాము చర్యలు తీసుకుంటున్నట్లుచెప్పారు.

పకడ్బందీగా సన్న బియ్యం పంపిణీ



లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినయోగం చేసుకోవాలని, పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తామని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ బాబాగూడలోని ఓ లబ్ధిదారు ఇంట్లో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమానికి పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు నాణ్యమైన బియ్యం అందించాలనే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని చేపట్టిందన్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్‌కమిషనర్ వెంకటవేణుగోపాల్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్, మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వైస్ గౌడ్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి స్లాట్ స్లిప్‌లు అందజేస్తున్న డీఐటీ మధుసూదన్‌రెడ్డి

మరింత సులువుగా రిజిస్ట్రేషన్లు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ విక్రయాల ప్రక్రియను మరింత సులభం చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తెచ్చిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐటీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం ప్రారంభించిన 15నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పద్ధతి పనితీరును పరిశీలించి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి స్లిప్‌లను అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆస్తుల క్రయవిక్రయాలు చేసే వారికి ఇబ్బందులు కలగకుండా త్వరగా వారు తమ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రతి రిజిస్ట్రేన్ కార్యాలయంలో రోజూ 48 రిజిస్ట్రేషన్‌లకు స్లాట్‌బుక్ చేసుకునే వీలు ఉందన్నారు. స్లాట్‌లో పేర్కొన్న విధంగా సమయానికొచ్చి ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. కార్యాలయంలో గంటల తరబడి వేచి ఉండే అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ అయిన 10 నిమిషాల్లో దస్తావేజులు అందజేస్తామన్నారు. 15నిమిషాల్లో తమ ఆస్తిని రిజిస్టేషన్ చేసుకుని కార్యాలయం నుంచి వెళ్లొచ్చన్నారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోదలచిన వారు ముందు వెబ్‌సైట్‌లో స్లాట్‌ను బుక్ చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు నిబంధనలకు లోబడి ప్రభుత్వ నిర్దేశించిన విధంగా ఆస్తులను ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలకు ముందుకు రావాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యసేవలందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. దేవునిపడకల్‌లో జగ్‌పాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కృష్ణదేవ్‌రెడ్డి నిర్వహించిన కంటి వైద్య శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమానికి రాఘవేందర్‌రెడ్డి హాజరై 200మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధామణి దేవి, ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి, శ్రీను, కల్యాణ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కేశంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నెలల తరబడి వేతనాలు బకాయిలున్నాయని తెలిపారు. కార్మికులను రెండో పీఆర్సీ పరిధికి తేవాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. నెలకొకసారి సబ్బులు, నూనె, బెల్లం ఇవ్వాలన్నారు. సంవత్సరానికోసారి రెండు జతల బట్టలు, బూట్లు ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీవో కిష్టయ్య, కార్మికులు రమచంద్రయ్య, రవి, రోశయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

మాడ్గుల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్లతో నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంతో పాటు నాగిళ్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రమాం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ ధర పెంచటంతో పేదలపై పెనుభారం పడుతుందని సీపీఎం మండల కార్యదర్శి పులికంటి రమేష్ ఆరోపించారు. నాయకులు పల్లేటి శ్రీశైలం, చంద్రయ్య, నర్సింహ, అంజయ్య, శ్రీను, కాటం రాజు, మహేష్, శివ, అంజయ్య, వెంకటయ్యలు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, మహిళలు

రిజర్వేషన్లకు ముప్పు కలిగించేలా బీజేపీ కుట్ర



పరిగిలో జై సంధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణ పేరిట రిజర్వేషన్లకు ముప్పు కలించేలా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుట్రచేస్తోందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే పరిగిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ.. ఏడో గ్యారంటీగా రాజ్యాంగ పరిరక్షణకు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, పాలాది శ్రీనివాస్, పి.చిన్ననర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌ను విస్తృతపర్చాలి

కొత్తూర్: జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అమలుపరిచేందుకు కాంగ్రెస్ కార్యకర్త కృషిచేయాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీఖాన్ పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాదయాత్రలకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ మండల కమిటీ సభ్యులుగా అగ్గనూర్ విశ్వం, చెన్నయ్య, రవిలను నియమించారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, నాయకులు పి.రఘు, బస్వం, ఇబ్రహీం, దేవేందర్ ముదిరాజ్, నుస్రత్‌బేగం, రవినాయక్, రాందాస్‌నాయక్, మహబూబ్, మహిపాల్‌రెడ్డి, చందురెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్

ఆలయాల్లో ఘనంగా హోమాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయగణపతి, జ్ఞానసరస్వతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయాల్లో తృతీయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తుల రాక నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పోకల బస్వరాజ్ రాజమణి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల రెండోరోజు గురువారం హోమం,ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు(శుక్రవారం) నిర్వహించే సీతారాముల కల్యాణానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సాయిరెడ్డి, మల్లికార్జున్, దిలీప్‌కుమార్, నాగార్జున్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ, సంతోష్, వినయ్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని అవుశాపూర్ ఉమామహేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు పన్నాల మల్లారెడ్డి తెలిపారు. ఈ నెల 12న జరుగనున్న హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను గురువారం అవుశాపూర్‌లో ఆవిష్కరించారు. అవుశాపూర్ నుంచి ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ వరకు బైక్ ర్యాలీపై హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవుశాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కె.వీరేశం, సదానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి దామర్‌చెడ్‌లో భవానీమాత జాతర

బషీరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దామర్‌చెడ్ గ్రామం జగదాంబ భవానీమాత ఆలయం జాతరకు ముస్తాబైంది. శుక్ర, శనివారాలు జాతర జరగనుంది. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మన్, శంకర్ స్వామీజీ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మహాచండీ హోమం, అనంతరం పార్వతీపారమేశ్వరులు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు, సాయంత్రం అమ్మవారి పల్లకీసేవ, రాత్రి సాంస్కృతిక, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

బాకారంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు

యాలాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాకారం ఆంజనేయస్వామి ఆలయ జాతర నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని అర్చకులు, ధర్మకర్తలు హర్షవర్ధన్ జోషి, విష్ణువర్ధన్ జోషి గురువారం తెలిపారు. నేడు యాలాల హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకిసేవ, 12న అభిషేకం, అన్నప్రసాదం, రాత్రి రథోత్సవం, 13న ఉదయం సత్యనారాయణస్వామి పూజ, సాయంత్రం పెరుగు వసంతం కార్యక్రమాలుంటాయని వివరించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తా

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తానని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలోని పలుకాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ వేసి గురువారం కృష్ణానీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పైపులైన్లు వేసి కృష్ణానీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. నాయకులు బద్దం కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానీటిని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గణితం టీచర్‌ను బదిలీ చేయొద్దు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరిగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ చక్రపాణిని డిప్యూటేషన్‌పై ఎస్ఎస్ఏకు పంపించవద్దని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్, డీఈవోలకు వినపత్రాలందజేశారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు జెటావత్ శంకర్ మాట్లాడుతూ..ముజాహిద్‌పూర్ పాఠశాలలో 500మంది విద్యార్థులు ఉన్నారని, మ్యాథ్స్ టీచర్‌లేకుంటే విద్యార్థులు అతి ముఖ్యమైన గణితం సబ్జెక్టులో విద్యార్థులు నష్టపోతారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఏ చక్రపాణిని డిప్యూటేషన్‌పై పంపొద్దని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘాల నాయకులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

దుద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్‌లోఏర్పాటు చేయనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కిషన్‌నాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని 252సర్వే నంబరులో గల 10గుంటల భూమిని గుర్తించి జిల్లా ఆరోగ్య శాఖకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, సర్వేయర్ మహేశ్, ఏఈ వివేక్ పాల్గొన్నారు.

వరి చేను కళకళ!

తాండూరు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోరు బావుల కింద యాసంగి వరిపంట కళకళలాడుతోంది. చెంగోల్, బెల్కటూర్, నారాయణపూర్, గోనూరు, వీర్‌శెట్టిపల్లి, చింతామణిపట్నం, పర్వతాపూర్, అంతారం, ఖాంజాపూర్ చెనిగేష్‌పూర్, గౌతాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో వరి సాగు చేశారు. పంట ప్రస్తుతం గింజపట్టే స్థితిలో ఉంది. నారాయణపూర్‌లో రవ్వలకొండ రామాలయం వద్ద కాగ్నా నది పరీవాహక ప్రాంతంలో పంట పచ్చగాకన్పిస్తోంది. నీటిఎద్దడి లేకపోవడంతో ఎండేముప్పు తప్పిందని రైతులంటున్నారు.



నారాయణపూర్ రవ్వలకొండ సమీపంలో వరి పంట

చల్లని తాటి ముంజలు

ఎండల్లో తక్షణ ఉపశమనం.. ఆరోగ్యానికి ఎంతో మేలు
ముంజలకు కేరాఫ్ ఆమనగల్లు.. జోరందుకున్న అమ్మకాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదమైన తాటిముంజల సీజన్ రానే వొచ్చింది. ఆరోగ్యానికి శక్తినివ్వడంతో పాటు ఎండవేడి నుంచి ఉపశమనాన్నిచ్చే ముంజల విక్రయాలు జోరందుకున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ముంజల అమ్మకాలు ఎక్కువగా సాగుతాయి. ఎండల నుంచి ఉపశమనం పొందడం, ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతిసిద్ధ తాటి ముంజలను అన్ని వర్గాల ప్రజలు ఇష్టంగా తింటారు. తాటిముంజలకు రాష్ట్రంలోనే ఆమనగల్లు ప్రాంతం ప్రసిద్ధి. ముంజలతో జీర్ణశక్తి మెరుగవుతుంది. చలువనిచ్చే ముంజలను తినేందుకు చిన్నా పెద్ద ఇష్టపడతారు. ముంజలకు డిమాండ్ పెరగడంతో పల్లె, పట్టణం అనే తేడాలేకుండా అన్నిచోట్లా ఇవి లభిస్తున్నాయి. ప్రధానంగా రహదారుల పక్కన ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఎండలో వెళ్లే బాటసారులు ఉపశమనాకి కూల్ డ్రింక్‌లకు బదులు ముంజలు కొంటున్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాలు ముంజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. తాటి వనాలు, కల్లు, ముంజలకు పేర్గాంచిన ఆమనగల్లు సబ్ డివిజన్‌లో ఏటా ముంజల అమ్మకాలతో రూ.లక్షల వ్యాపారం జరుగుతోంది. మార్చిలో మొదలై ఏప్రిల్‌లో ముంజల వ్యాపారం జోరందుకుంది. వీటి విక్రయాలతో వందలాది మంది గీత కార్మికులు, మహిళలు ఉపాధి పొందుతున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై తాటికాయల రాశులుపోసి ముంజలు విక్రయిస్తున్నారు.


కాయల నుంచి ముంజలను తీస్తున్న గీత కార్మికుడు

తాజా ముంజల అమ్మకాలు

ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాల నుంచి నిత్యం గీత కార్మికులు, వ్యాపారులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తాటికాయలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అక్కడ కాయల నుంచి ముంజలను తీసి విక్రయిస్తుండడంతో జనం ఎక్కువగా కొంటున్నారు. గతంలో తలాటిచెట్ల వద్దే గీత కార్మికులు ముంజలు తీసి గంపలు, తట్టల్లో కానుగాకుల మధ్యలో వేసి హైదరాబాద్, ఇతర పట్టణాలకు తరలించేవారు. కాయల నుంచి ముంజలను బయటకు తీయడంతో దూర ప్రాంతాలకు తరలించి అమ్మే సమయంలో ఎండకు ముంజలు ఎండిపోయేవి. రుచి కూడా తగ్గేంది. దీంతో కొనుగోలుదారులు అనాసక్తి చూపేవారు. ఈ సమస్యను నివారించేందుకు వ్యాపారులు, గీత కార్మికులు వారు అమ్మేచోటనే కాయల నుంచి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. దీంతో తాజాగా కల్లుకారుతూ ఉండే ముంజలను కొనేందుకు జనం ఆసక్తి ఇష్టపడుతున్నారు. ఇదిలా ఉంటే రియల్ ఎస్టేట్ ప్రభావంతో గత పదేళ్లలో తాటి వనాలు తగ్గుతున్నాయి. దీంతో మంజుల దిగుబడి పడిపోయిందని గీత కార్మికులు చెబుతున్నారు. కొరతతో ముంజలకు డిమాండ్, ధర పెరిగాయి. గ్రామస్తులు ప్రస్తుతం ఎక్కువ ధర పెట్టి ముంజలు కొనలేకపోతున్నారు.



డజన్ ముంజలకు రూ.80 నుంచి 100

ముంజల ధర ఏటేటా పెరుగుతోంది. 20ఏళ్ల కింద రూ.10కి డజన్ ముంజలు వచ్చేవి. క్రమంగా డజన్‌కు రూ.20 నుంచి 30.. 50, 70 ఇలా పెరుగుతూ ప్రస్తుతం 80 నుంచి రూ. వందకు డజన్ అమ్ముతున్నారు. వాతావరణం చల్లబడిన సందర్భాల్లో ఈ ధర తగ్గుతుందని విక్రయదారులు చెబుతున్నారు. ముంజల విక్రయాలతో గీత కార్మికులు, మహిళా కూలీలు, యువకులకు ఉపాధి పొందుతున్నారు. తాటివనాల నుంచి పట్టణాలకు ముంజల తరలింపుతో కూలీలు, ఆటో వాలాలకు సైతం ఉపాధి లభిస్తోంది. రవాణా ఖర్చులు పోను రోజుకు రూ.700 నుంచి వెయ్యి వరకు సంపాదిస్తున్నామని కూలీలు పేర్కొంటున్నారు.

ముంజల సేకరణలో వివిధ దశలు

తాటిచెట్టుపైనుంచి కాయలను కిందికి దించడం.. కాయలు వొలిచి ముంజలను వేరుచేయడం వంటివి జాగ్రత్తలతో కూడుకున్నవి. తాటి చెట్టుపైనుంచి కార్మికులు తాడుకట్టి కాయ గెలలను కిందికి దించుతారు. కాయలు చెట్టుపై నుంచి కింద పడితే పగిలి ముంజలు చితికిపోతాయి. అందుకే వాటిని జాగ్రత్తగా సేకరిస్తారు. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాల్లో 2లక్షల వరకు తాటి చెట్లున్నాయి. వీటిలో సగానికిపైగా చెట్లను తాటి కాయలకు, గీతకు ఉపయోగిస్తున్నారు. చాలా వరకు బొత్తలు వృథాగా ఉంటున్నాయి. తాటిచెట్లు గీతకొచ్చిన నాటి నుంచి 30ఏళ్ల వరకు కల్లు గీతకు, ముంజలకు వినియోగిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లోనూ తాటి వనాలు ఉన్నాయి.

ముంజల్లో పోషకాలు మెండు



ప్రకృతి సిద్ధంగా లభించే తాటిముంజలు ఎండవేడి నుంచి మనిషికి తక్షణ ఉపశమనాన్నిస్తాయి. వీటిలో విటమిన్లు, సూక్ష్మపోషక ఎలక్ట్రోలైట్లు, మినరల్స్, గ్లూకోజ్ ఉంటాయి. ఎండలతో శక్తి కోల్పోయే శరీరానికి ముంజలతో తక్షణశక్తి లభిస్తుంది. నీరందుతుంది. జీర్ణవ్యవస్థ వృద్ధి చెందుతుంది. అయితే ముదిరిన ముంజులు ఎక్కువగా తింటే అజీర్ణ సమస్యతో కడుపు నొప్పి వస్తుంది.

\- మంజులాదేవి,
ప్రభుత్వ వైద్యురాలు, ఆమనగల్లు


ఆమనగల్లు మండలంలో తాటిచెట్లు

ఉపాధి పొందుతున్నాం



వేసవిలో తాటి ముంజలు అమ్మకంతో ఉపాధి పొందుతున్నాం. తాటిచెట్ల యజమానులు, గీత కార్మికుల నుంచి కాయలు కొని ఆమనగల్లుకు తెచ్చి అమ్ముతున్నాం. రవాణా ఖర్చులు పోను రోజుకు రూ.1000 వరకు కూలి గిట్టుబాటవుతోంది. రవాణా చార్జీలు, చెట్ల యజమానులు ధరలు పెంచడం వల్లే కొనుగోలుదారులకు ధర పెంచాల్సి వస్తోంది. కాయల దిగుబడి కూడా తగ్గింది.

\- కొప్పుల మహేశ్, శెట్టిపల్లి

తాటిచెట్లు అంతరిస్తున్నాయి



రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఏటేటా తాటిచెట్లు తరిగిపోతున్నాయి. గతంలో ఖాళీ స్థలాలు, పొలాల్లో ఎక్కువగా తాటి చెట్లు ఉండేవి. అభివృద్ధితో పట్టణాలకు కొన్ని కిలోమీటర్ల దూరం వరకు స్థలాలను లేఔట్లు చేస్తున్నారు. తాటిచెట్ల నరికివేతతో ముంజలకు డిమాండ్ పెరిగింది. వేసవిలో కల్లు, ముంజల అమ్మకాలతో కుటుంబ పోషణ చేసుకుంటున్నాం.

చందు, నాగిళ్లతండా


కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

మొయినాబాద్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో అద్దాల మహల్ ఎదుట ఏర్పాటు చేసిన పందిరిలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. అర్చకులు సౌందరరాజన్, గోపాలకృష్ణ, రంగరాజన్‌లతో పాటు ఉత్సవాల నిర్వహణ కోసం వచ్చిన అర్చకులు కల్యాణం తంతును నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి ఎదురుకోల్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు గ్రామస్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం రాత్రి 11:30 గంటలకు ప్రారంభమై 1:30 గంటల వరకు జరిగింది.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

మంచాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలందరి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి గురువారం సహపంక్తి భోజనాలు చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం చరిత్రాత్మకమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యున్నతికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వి.హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్యయాదవ్, ఎడ్మ నరేందర్‌రెడ్డి, ఆనంగళ్ల యాదయ్య, సలాం, జెగ్నె వెంకటేష్‌యాదవ్, మల్లేష్, మాసయ్యగౌడ్, మార సురేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, ప్రవీణ్, నాగరాజు, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం కావాలి

వికారాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలుగకుండా 2024 యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్, సివిల్ సప్లై, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు కేంద్రాలను ఈ నెల 15న ప్రారంభించాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 128 కేంద్రాలు ఏర్పాటవుతున్నాయని, వీటిలో 11 సన్న వడ్లు, 117 దొడ్డు వడ్ల కోసం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 90వేల టన్నుల దొడ్డు వడ్లు, 10వేల టన్నుల సన్న వడ్లు కొనే అవకాశముందని తెలిపారు. ఏప్రిల్ చివరికల్లా కొనుగోలు ఉధృతం అవుతాయని పేర్కొన్నారు. ప్రతీ కేంద్రంలో ధరల వివరాలు, తేమ శాంతి వంటి సమాచారాన్ని ఫ్లెక్సీలతో డిస్‌ప్లే చేయాలని తెలిపారు. రైతుల ఆధార్ నమోదు తప్పనిసరి చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, డీఎం సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీసీఎంఎస్ శ్యామ్ రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో బీజేపీ పాదయాత్ర

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ హ్యాట్రిక్ సాధించడం, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో డీకే అరుణ గెలవడంతో బీజేపీ చేపట్టిన యాదగిరిగుట్ట పాదయాత్ర మండుటెండల్లో కొనసాగుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడో రోజు గురువారం చంద్రాయన్‌గుట్ట నుంచి సంతోషన్‌నగర్ చౌరస్తాకు చేరింది. పాదయాత్ర చేస్తున్న నాయకులు కోరమోని హరిభూషణ్‌పటేల్, రొల్లు రాధికగౌడ్, బి.కురుమయ్య, రొల్లు రఘురాములుగౌడ్, సామ శంకర్‌రెడ్డి, టి.నర్సింహ, మదన్‌గౌడ్‌లను శ్రీవర్ధన్‌రెడ్డి సన్మానించారు. పార్టీపై ఉన్న అభిమానంతో సనాతన ధర్మాన్ని పాటిస్తూ మండుటెండల్లో యాదగిరిగుట్టకు పాదయాత్ర చేయడం అభినందనీయమని శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు.

కూరగాయల అమ్మకాలకు జాగ చూపండి

చౌదరిగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తైబజారులో 50 వసూలు చేస్తున్నారు. అదనంగా మరో 50రూపాయాలిస్తాం. కూరగాయాలు విక్రయానికి స్థలం చూపాలని ఓ మహిళా రైతు తైబజారు వసూలు చేస్తున్న వ్యక్తులను నిలదీసింది. ఈ ఘటన గురువారం చౌదరిగూడ సంతలో చోటు చేసుకుంది. జిల్లేడ్ చౌదరిగూడలో ప్రతి గురువారం అంగడి కొనసాగుతోంది. సంతలో కూరగాయాలు కయవిక్రయాలకు గ్రామాల రైతులు, చిరు వ్యాపారులు కూరగాయాలు అమ్మేందుకు వస్తుంటారు. గురువారం తూంపల్లికి చెందిన మహిళా రైతు సునీత కూరగాయాల విక్రయానికి సంతకు రాగా ఆమెకు స్థలం దొరకలేదు. ఎక్కడ కూర్చున్నా తోటి విక్రేతలు ఆమెకు అడ్డు చెప్పారు. దీంతో విసుగు చెందితాను కూరగాయలు ఎక్కడ అమ్ముకోవాలని ఆవేదన చెందారు. 'ప్రతీ వారం తైబజారుకు 50రూపాయాలు ఇస్తున్నాం. ఇప్పుడు జాగ లేదు. వంద రూపాయలు ఇస్తా. అమ్ముకునేందుకు నాకు జాగ చూపాలి.' అని తైబజారు నిర్వాహకులను ఆమె నిలదీసింది. రైతులు కూరగాయలు అమ్ముకునేందుకు కూడా సౌకర్యం లేకుండా ఎలా అని వాపోయింది.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

కీసర రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం వద్ద సిబ్బంది ఆందోళనకు దిగారు. వేతనాలు రాక కార్మికులు పస్తులుంటున్నారని, ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఉన్నిక్రిష్ణన్, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

నందిగామ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు ప్రతిభతో జాతీయస్థాయిలో రాణించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తాయని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మామిడిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను నవీన్‌రెడ్డి నాయకులతో కలసి ప్రాంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా చదువు, క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీ నిర్వహిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రవిందర్, శ్రీనివాస్, సత్యనారయణ, హన్మంతరెడ్డి, షఫీ, రఘుపతిరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, అబ్బాస్, ప్రభు, ప్రతాప్‌రెడ్డి, మొయినుద్దీన్, అశ్రఫ్, పురుశోత్తంరెడ్డి, వినోద్, అన్వర్, రాంరెడ్డి, ఆంజనేయులుగౌడ్, కృష్ణారెడ్డి, నిర్వాహకులు చిట్టి, చందు, రాజు, మనోహర్, మజీద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

చౌదరిగూడ, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించి.. రాజ్యాంగాన్ని రక్షించుకుందామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య అన్నారు. గురువారం కొందుర్గులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి అనేక మంది యువకులు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. నేటి బీజేపీ పాలకుల అధికారం కోసం కులాన్ని, మతాన్ని వాడుకుంటూ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒంటెద్దు పోకడలతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నారని అన్నారు. గత పదేళ్లలో కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేడు ఉద్యోగాలను తీసేస్తోందన్నారు. వెంకటేశ్, కృష్ణ, సురేష్, భూపాల్, రఫీక్, జంగయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనను కోరుకుంటున్న ప్రజలు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు మరోసారి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలననే కోరుకుంటున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ వరంగల్ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు భ్రమపడి కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో వాగ్దానాలను అమలు చేయకపోగా, అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరందించాలనే కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పథకాన్ని చేపట్టారన్నారు. పనులు చివరి దశలో ఉన్న ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరందించాలన్న ఆలోచన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. మల్లా కేసీఆర్ పాలనొస్తేనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారని మాజీ మంత్రి తెలిపారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ క్యాడర్, అభిమానులు తరలిరావాలని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజావరప్రసాద్, కె.నరేందర్, వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, కడెంపల్లి శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, నటరాజ్, అంతయ్య, వెంకట్‌రాంరెడ్డి, యుగంధర్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, శ్రవణ్, నవీన్, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.


వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యయాదవ్, నాయకులు


శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారులు

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు భాగా హాజరయ్యారు. ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయీశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు అంతయ్య, టి.ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్, రాయల శంకర్, నర్సింహులుగుప్తా, మధు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

» బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చండీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని వైష్ణవి గార్డెన్‌లో శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి కార్యకర్తలు రెడీగా ఉండాలన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్, సుధాకర్‌రెడ్డి, దండే శ్రీశైలం, స్వామిగౌడ్, బాలశివుడు, శ్రీనివాస్, విష్ణువర్దన్‌రెడ్డి రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసం.. ప్రతిపక్షాల కుట్ర'

హయత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు మదర్ డెయిరీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డిపై అవిశ్వాసం పెడుతారని వస్తున్న వార్తలను చైర్మన్, తొమ్మిది మంది డైరెక్టర్లు ఖండించారు. గురువారం హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో చైర్మన్ గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, డైరెక్టర్లు మాట్లాడారు. అవిశ్వాసం బూటకమన్నారు. డెయిరీని ఇబ్బందులకు గురిచేసి పబ్బం గడుపుకునేందుకు కొందరు యత్నిస్తున్నారని విమర్శించారు. డెయిరీని గట్టెక్కించేందుకు తాము కృషిచేస్తుంటే కొందరు అవిశ్వాసం అని లీకులిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లంతా ఒకేతాటిపై ఉన్నామని స్పష్టం చేశారు. త్వరలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఐలయ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. పాడి రైతులను, ఉద్యోగులను, డెయిరీని కాపాడుకుంటామన్నారు. రైతులకు ఇప్పటికే కొన్ని బిల్లులు చెల్లించామని, త్వరలో మరిన్ని చెల్లిస్తామని అన్నారు. ఆస్తులను అమ్మడం కొంత ఆలస్యమైతోందని, అంత వరకు ముఖ్యమంత్రి సహకారాన్ని అర్థిస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు మందడి ప్రభాకర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, కళ్లపల్లి శ్రీశైలం, కర్నాటి జయశ్రీఉప్పల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మండలి జంగయ్య, గూడూరు శ్రీధర్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సుకు పాటుపడేది బీజేపీ

శంకర్‌పల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసమే పని చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం శంకర్‌పల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని సూచించారు. మిగతా పార్టీల్లా మీడియాల్లో ప్రచారానికి బీజేపీ ఆసక్తి చూపదన్నారు. రాజకీయాల్లో అధికారంలోకి వచ్చేందుకు చాలామంది అబద్ధాలు చెబుతున్నారని, దీనిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గ్రామాల్లో బిజేపీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలన్నారు. అంతకు ముందు పలువురు ముస్లింలు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు. మండలానికి మహిళా అధ్యక్షురాలు ఉంటే ఆమె భర్త ఫొటోను ఫ్లెక్సీల్లో ఎలాపెడతారంటూ నాయకులు హాల్లో కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీ జోక్యం చేసుకొని.. ఇలాంటి చిన్న విషయాలపై కూర్చొని మాట్లాడుకుందామని సర్దిచెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, కె.ప్రకాశ్, పార్టీ మండలాధ్యక్షురాలు లీలావతి, పట్టణాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహ, పరమేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


హక్కుల సాధనకు ఉద్యమించాలి


నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు సదానందం

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పూసల కులస్తులు ఐక్యంగా ముందుకు సాగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సదానందం, రాష్ట్ర నాయకులు బత్తుల శ్రీహరి, నాగరాజు పిలుపునిచ్చారు. కడ్తాలలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపులేటి వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు పి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణ్, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పురుషోత్తం, భాస్కర్, వెంకటేశ్, నారాయణ, కోటయ్య, సోమమ్మ, మంగమ్మ, పద్మ, లక్ష్మి, కృష్ణవేణి, గీత, సరిత, శివలీల, లక్ష్మయ్య, దానయ్య, ఆంజనేయులు, భూలక్ష్మి, స్వరూప, జ్యోతమ్మ పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో చేపల మార్కెట్ నిర్మించాలి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ప్రతీ నియోజకవర్గంలో 20లక్షలతో చేపల మార్కెట్‌లు నిర్మాణం, మత్స్యమిత్ర మహిళా గ్రూపుల పునరుద్ధరణ, ఎఫ్‌సీడీసీ స్కీమ్, 90శాతం సబ్సిడీరుణాలు, కోహెడలో హోల్‌సేల్/రీటైల్ చేపల మార్కెట్ పనులను ప్రారంభించాలని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. గురువారం నర్కుడలో ముదిరాజ్ మత్స్యకార మహిళల సమావేశం నిర్వహించారు. ప్రతీ సొసైటీ చెరువు కుంటల్లో చేప, రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీకి ఖాతాల్లో నగదు జమచేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు. కోహెడలో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన గత ప్రభుత్వం 10 ఎకరాల స్థలం ఇచ్చి మార్కెట్ నిర్మాణానికి రూ.47కోట్ల కేటాయించినా పనులు చేయలేదన్నారు. ఆక్రమణల నుంచి చెరువులు, కుంటలను రక్షించాలన్నారు. ఏప్రిల్, మే నెలల్లో మత్స్యకార సొసైటీల సమస్యలపై అధ్యయనం చేసి మే 15న డిమాండ్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా తలపెట్టామని తలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి మల్లేశ్, నీరటి అనురాధ, జ్యోతి, మాధవి, సరస్వతి, లక్ష్మి, లతిక తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

ఫార్మా భూముల సర్వేపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

కొందరు నాయకులు చేసిన హంగామాను అధికారులు చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఆ ఘటనతో తేరుకున్న అధికారులు శాంతియుతంగా ఆందోళనకారులను సముదాయించి పనులు సాఫీగా చేయించాలని కలెక్టర్, టీజీఐఐసీ అధికారులు, రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

ప్రతీ రోజు ఎన్ని కిలోమీటర్ల మేర హద్దులు గుర్తిస్తున్నారు.. ఎన్ని కడీలు బిగిస్తున్నారని కలెక్టర్, టీజీఐఐసీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ పనులకు సుమారుగా రూ, 16కోట్ల మేర వ్యయం కావొచ్చని టీజీఐఐసీ జోనల్‌మేనేజర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. పరిహారం పొందని రైతుల, కోర్టు కేసుల్లో ఉన్న భూముల జోలికి వెళ్లొద్దని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాచకొండ పోలీసులు పనులను డ్రోన్‌కెమెరాలతో పర్యవేక్షిస్తుండడంతో రెవెన్యూ టీజీఐఐసీ అధికారులు ఉదయం 10.30గంటలకే పనులు ప్రారంభిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఐదున్నర గంటల వరకు పనులు చేస్తున్నారు.

కోర్టు కేసుల్లో ఉన్న భూముల సర్వే నిలిపివేత

నానక్‌నగర్, మేడిపల్లి, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 2500 ఎకరాల భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఈ భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేయడం లేదు. ఈ భూములకు సుమారు 20ఫీట్ల మేర రోడ్డు ఉండేలా అధికారులు నిర్ణయించారని తెలిసింది.

ప్లాట్ల కేటాయింపునకు ఏర్పాట్లు

ఫార్మాసిటీకి భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు కేటాయింపు, పరిహారం చెల్లింపు పనులలో రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు నిమగ్నమయ్యారు. నెలరోజుల్లో లబ్ధిదారులకు ప్లాట్లు ఇవ్వడానికి కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పల్లె చెల్కతండా వాసుల పరిస్థితేంటి?

పల్లెచెల్కతండాకు చెందిన పది మంది రైతులు 184 సర్వే నెంబర్‌లో 18 ఎకరాల సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్నారు. వీరు ఏళ్ల తరబడిగా ఇవే భూములపై ఆధారపడి బతుకుతున్నారు. కాగా రైతుల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వీరికి పరిహారం ఎలా చెల్లించాలని రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు తలలు బాదుకుంటున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోతే పరిహారం ఇవ్వడం కుదరదని చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

మా నోట్లో మట్టికొట్టొద్దు



మేం చాలాఏళ్ల నుంచి ఈ భూమిలో పంటలు సాగు చేస్తూ బతుకుతున్నం. ఈ భూమిని దున్ని పూట గడుపుకుంటున్నం. ఉన్నట్టుండి భూమి తీసుకుంటే మా బతుకులేం కావాలో మీరే న్యాయం చెప్పండి. భూమి తీసుకొని మా నోట్లో మట్టికొట్టకండి. ఈ భూమికి కాగితాలు లేవు. మా గోస ఎవరికి చెప్పాలో తోచడం లేదు.

- కమ్లి, రైతు వల్లెచెల్కతండా

పొలం దున్నుకోండి



మీ పొలంలో పంటలను పండించుకోవచ్చు. వాటిని మేము పాడుచేయం. భూములకు సంబంధించి పత్రాలు లేవని గిరిజనులు చెబుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటాం.

- టి.అయ్యప్ప, తహసీల్దారు, యాచారం

పరిహారం అందించి ఆదుకోవాలి

- సర్వే పనులను అడ్డుకున్న గిరిజన రైతులు
- పత్రాలు లేకుండా పరిహారం ఎలా ఇస్తారన్న తహసీల్దార్



తహసీల్దార్ అయ్యప్పతో వాగ్వాదానికి దిగిన గిరిజనులు

యాచారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'మా ముత్తాతల కాలం నుంచి ఈ నేల తల్లిని నమ్ముకొని బతుకుతున్నం. జీవనాధారమైన భూమి తీసుకుంటే మా బతుకులేం కావాలో మీరే న్యాయం చెప్పండని' పల్లెచెల్కతండాకు చెందిన గిరిజనులు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. సీలింగ్ భూమి తమకు జీవనాధారమని అధికారులకు మొరపెట్టుకున్నారు. గురువారం యాచారం మండలంలోని మేడిపల్లి రెవెన్యూ పరిధిలో 184 సర్వే నంబర్‌లోని 18 ఎకరాల భూమిని ఫార్మాసిటీ ఏర్పాటులో భాగంగా సేకరించి, అధికారులు సర్వే చేసి కంకర పోశారు. దీంతో ఆ భూముల్లో సాగు చేసుకుంటున్న 10 గిరిజన కుటుంబాలు అధికారులతో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అయ్యప్ప, సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు గిరిజనులను సముదాయించారు. అనంతరం ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతుల పేర్లను అధికారులు నమోదుచేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా పరిహారం ఎలా ఇవ్వాలని అధికారులు వారిని ప్రశ్నించారు. అలాగే భూములకు ఫెన్సింగ్ వేసినా సాగు చేసుకోవచ్చని తహసీల్దార్ అయ్యప్ప గిరిజన రైతులకు సూచించారు. అధికారులు మానవత్వంతో తమకు పరిహారం అందించి ఆదుకోవాలని గిరిజనులు వేడుకున్నారు. న్యాయం చేసి ఆదుకోవాలని పలువురు మహిళా రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలపడంతో శాంతించారు. తమకు న్యాయం చేయకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని బాధిత రైతులు తెలిపారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ



కడ్తాల్ : కొండ్రిగాని బోడు తండాలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి కడుపు నింపేందుకే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేపట్టిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సంపన్నులు తినే సన్నబియ్యం పేదవారికి అందించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలందుతున్నాయని అన్నారు. కడ్తాల మండలం కొండ్రిగాని బోడు తండాలో రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పొందిన సభావట్ టాక్రుజమ్రు లబ్దిదారుని ఇంట్లో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. తండాలో లబ్దిదారులను సన్నబియ్యం నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రగతిని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఓర్వలేక విపక్షాలు విష ప్రచారాలకు ఒడిగట్టాయని నారాయణరెడ్డి మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని, వాటిని అధిగమించి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను కొనసాగిస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన చేసుకోవాలని కొండ్రిగాని బోడు తండా గిరిజనులకు ఆయన సూచించారు. మార్కెట్ ఛైర్‌పర్సన్ గీతనర్సింహ, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు రవి, షాబొద్దీన్, యాదగిరిరెడ్డి, పాలకుర్ల రాములు, శ్రీను, రాజేశ్, భానుకిరణ్, పాండు, రమేశ్, రంగనాథ్, మేగ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. తేలికపాటి వర్షం



చేవెళ్ల : కిందపడిన విద్యుత్ స్తంభం



ఇబ్రహీంపట్నం : తుర్కగూడ సమీపంలో రోడ్డుపై పడిపోయిన ఎండిన చెట్టు

చేవెళ్ల/షాద్‌నగర్ అర్బన్/ఇబ్రహీంపట్నం/మాడ్గుల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలో పలు గ్రామాల్లో గురువారం సాయత్రం భారీ ఈదురుగాలులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. మండలంలోని రావులపల్లి, ధర్మసాగర్, గొల్లపల్లి, ముడిమ్యాల్, కుమ్మెర, దేవుని ఎర్రవల్లి తదితర గ్రామాల మీదుగా ఈదురు గాలులు వీయడంతో రావులపల్లికి సరఫరా అయ్యే విద్యుత్ స్తంభం విరిగిపోయింది. గమనించిన గ్రామస్తులు, రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కరెంటు సరఫరా నిలిపివేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈదుగాలులతో ప్రజలు భయంతో వణికిపోయారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. షాద్‌నగర్ పట్టణంలో గురువారం సాయంత్రం చిరు జల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి మండుటెండలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఉరుములతో కూడిన చిరుజల్లు కురిసి ఉపశమనం కల్గించింది. ఇబ్రహీంపట్నం మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గుంతలలోకి నీరు వచ్చి చేరింది. ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తుర్కగూడ సమీపంలో ఎండిన చెట్టు రోడ్డుపై కూలిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది. కప్పాడుకు రావల్సిన బస్సు రాలేదు. ప్రయాణికులను అక్కడే వదిలేయడంతో నడుచుకుంటూ గ్రామానికి చేరుకున్నారు. మాడ్గుల మండలంలోని పలు గ్రామాల్లో గాలి దుమారంలో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. కొన్ని చోట్ల మామిడికాయలు రాలిపోయినట్లు రైతులు చెప్పారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆదిభట్ల : మంగల్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో వినీతాదేవి, తదితరులు



కొత్తూర్ : సూచనలిస్తున్న సూపర్‌వైజర్ రేవతి



కడ్తాల్ : పోషక వారోత్సవాల్లో సూపర్ వైజర్ భక్త శబరి తదితరులు



కేశంపేట : సంగెంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శమంత

కడ్తాల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోషక విలువలను ప్రజలు గుర్తించాలని, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ భక్తశబరి సూచించారు. పోచమ్మగడ్డ తండా, కానుగుబావి తండాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఇన్ముల్‌నర్వలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. గర్భిణులు తీసుకునే జాగ్రత్తలు, పోషకాహారంపై మహిళలకు వివరించారు. టీచర్ రత్నమ్మ, యాదమ్మ, శోభ, ఇందిర, ఆశావర్కర్లు ఉన్నారు.

ఆదిభట్ల : గర్భిణులు, బాలింతలు. చిన్నారులు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఇబ్రహీంపట్నం సీడీపీవో వినీతాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగల్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ల బృందం, సెక్టర్ సూపర్‌వైజర్ సరళ, ఏఎన్ఎం, ఆశలు, టీచర్ మలమ్మ ఉన్నారు.

కేశంపేట : పోషకాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడుతుందని ఐసీడీఎస్ కొత్తపేట, కేశంపేట సెక్టార్ సూపర్ వైజర్లు శమంత, దివ్యాసింగ్‌లు అన్నారు. కొత్తపేట సెక్టార్ పరిధిలోని సంగెం, కేశంపేట సెక్టార్ పరిధిలోని దేవునిగుడి తండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీలో ఇచ్చే పోషక ఆహారం విధిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. టీచర్లు సువర్ణ, శశికళ, శివలీల, జ్యోతి, వినోద ఆశా కార్యకర్త అరుణలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

కేశంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి సూచించారు. కేశంపేట రైతు వేదికలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, కార్మికులతో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకూడదు



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

చౌదరిగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గు రువారం మండల పరిషత్ కా ర్యాలయంలో అధికారులతో స మీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నర్సరీ మొక్కల పెంపకంపై ని ర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏపీవో నర్సింగ్‌రావు, టీఏ లక్ష్మారెడ్డి, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసులపై దాడికి యత్నం.. వ్యక్తిపై కేసు

యాచారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఓ వ్యక్తి దాడికి దిగాడు. బుధవారం రాత్రి యాచారం పోలీసులు గున్‌గల్ గేట్ వద్ద బందోబస్తులో ఉన్నారు. అదే గ్రామానికి చెందిన కుంటి శ్రీకాంత్ పూటుగా మద్యం తాగి పోలీసులను పరుషపదజాలంతో దూషించడంతో పాటు తన సెల్‌ఫోన్‌ను పోలీసులపైకి విసిరి దూషించాడు. పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహ తెలిపారు.

మహిళ అదృశ్యం



సౌందర్య

ఆదిభట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. నాదర్‌గుల్‌కు చెందిన బోచళ్ల సౌందర్య(24)కు మతిస్థిమితం సరిగా ఉండదు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పసుపు కలర్ పంజాబీ డ్రెస్, గ్రీన్ పాయింట్ ధరించిందని.. మహిళ ఆచూకీ తెలిస్తే ఆదిభట్ల పోలీస్ స్టేషన్ నెంబర్-87126 62671కు సమాచారం అందించాలన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

కందుకూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతి పెద్దదైన భారత రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు ఆరోపించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండలంలోని సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, తిమ్మాపురం గ్రామాల్లో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ.. దేశ ప్రజల హక్కులను హరించే కుట్ర చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు చూస్తూ ఊరుకోరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను ప్రజలకు వివరిస్తూ మరింత చైతన్యం చేయడానికే గ్రామగ్రామాన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, నాయకులు ఎస్.వెంకటేష్‌గౌడ్, అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, ఎండీ సులేమాన్, సురేందర్, మంద సాయిలు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, బుక్క పాండురంగారెడ్డి, వి.బాబు, గాదె కుమార్, మీగడ శేఖర్, యాదగిరి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువను కాపాడాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చెరువు కాలువను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సింగంపల్లికి చెందిన చెరువు వాగు నక్షలో ఉందని, దాన్ని కొందరు పక్క సర్వే నెంబర్ల రైతులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వాగు నుంచి గ్రామానికి చెందిన అనేక మంది రైతులు తమ పంట పొలాలకు వెళ్తున్నారని, ఆక్రమణ దారుల నుంచి కాపాడాలని.. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బాల్‌రాజ్, రాములు, రాజు, శ్రీను, సాయిబాబా, సత్యనారాయణ, కృష్ణయ్య, తదితరులున్నారు

చదువుకు పేదరికం అడ్డుకాదు

తలకొండపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. వెల్జాలకు చెందిన పోలెపల్లి జ్యోతి-కుమారస్వామి దంపతుల పిల్లలు సుప్రియ, మణిదీక్షిత్, మాదాయిపల్లికి చెందిన మాధవి-శ్రీను దంపతుల పిల్లల చదువులకు గురువారం ఉప్పల ట్రస్ట్ ద్వారా రూ.50వేల చెక్కును వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, రాములు యాదవ్, కిశోర్, శ్రీధర్, శ్రీను, నరేశ్, నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అరకొర పెంపుతో అసంతృప్తి!

(5వ పేజీ తరువాయి)

పనులకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వచ్చేందుకు కూలీలు మొగ్గుచూపేవారు. అయితే పనులు కొలతల ప్రకారమే ఇస్తుండటంతో కూలీలకు పెద్దగా కూలి గిట్టుబాటు కావడం లేదు. దీనికి తోడు ప్రైవేట్‌లో కూలీల కొరత ఉంది. రూ.600 నుంచి రూ.800 వరకు కూలి ఇస్తుండటంతో ప్రైవేట్ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు.


అందని వేసవి భత్యం..

రెండేళ్లుగా ఉపాధి కూలీలకు వేసవి భత్యం అందటం లేదు. వేసవిలో కూలీ శ్రమకు అదనంగా 20నుంచి 30 వరకు, ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5నెలల పాటు అదనపు భత్యం అందించేవారు. ఒక్కోనెలలో ఒక్కో విధంగా చెల్లించేవారు. వేసవిలో ఒక కూలీ 60 శాతం పనిచేస్తే దానికి 20 నుంచి 30 శాతం వరకు కలిపి అంటే 80 నుంచి 90 శాతం వరకు పని చేసినట్టుగా డబ్బులు చెల్లించేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనపు భత్యం లభించేది. వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా శ్రమించాల్సి ఉంది. అలసట కారణంగా పూర్తి స్థాయిలో పనిచేయలేరు. ఈ కారణంగా అదనపు భత్యం చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ప్రస్తుతం చేపడుతున్న పనులివే..

వేసవిలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సులభమైన పనులను సూచిస్తుంది. పాంపాండ్స్, క్యాటిల్‌షెడ్స్, చెక్‌డ్యామ్‌లు, డైవర్షన్ కెనాల్స్, వేస్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్, ఫీడర్ ఛానల్స్, పంట పొలాలకు మట్టి రోడ్ల పనులు కల్పిస్తుంది. జిల్లాలో 1,59,172 జాబ్ కార్డులు ఉండగా అందులో 97,328 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. ప్రస్తుతం 13,773మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.


కూలి సరిపోవడం లేదు



ఉపాధిహామీ ద్వారా ఇస్తామన్న రూ.307 కూలి ఏమాత్రం సరిపోవడం లేదు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మరింత పెంచాలి. బయట వ్యవసాయ, ఇతర పనులకు వెళితే రూ.600 వరకు కూలి వస్తది. ప్రభుత్వం ఇచ్చేది సరిపోక వ్యవసాయ, ఇతర పనులకు పోతున్నాం.

- నర్సమ్మ, ఉత్తరాసిపల్లి, కొందుర్గు మండలం

నష్టపోతున్నాం..



మేస్త్రీ చేతి కిందికి పనికి పోతే రూ.800 కూలి ఇస్తున్నాడు. ఉపాధి పనికి పోతే రోజుకు రూ.220 కూడా రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం కూలి పెంచుతుంది. కానీ.. మాకు పూర్తి స్థాయిలో అందటం లేదు. కొలతలు చేసి ఇచ్చేవరకు కూలి తగ్గిపోతుంది. ఉపాధి కూలీ కంటే బయట పనిచేసుకుంటే పనికి తగ్గ ప్రతిఫలం వస్తుంది. ప్రభుత్వం ప్రతి కూలీకి రోజుకు 307 రూపాయలు అందేలా చూస్తే లబ్ధి చేకూరుతుంది.

- రాజు, పెద్దఎల్కిచర్ల, చౌదరిగూడ మండలం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చౌదరిగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని పులుసుమామిడిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో మంజూరైన సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పురుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సురేందర్ రెడ్డి, సిర్ప మల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐ జానకిరామ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఆమనగల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు సీఐగా జానకీరామ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్‌ను ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఏసీబీలో పనిచేస్తున్న జానకీరామ్‌రెడ్డికి ఆమనగల్లుకు పోస్టింగ్ ఇచ్చారు. సీఐ కార్యాలయంలో ప్రమోద్‌కుమార్ నుంచి జానకీరామ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కాషాయం పార్టీ

(5వ పేజీ తరువాయి)

తీసుకుపోతామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు.

దేశ ప్రజలంతా తెలంగాణ వైపు చూస్తున్నారు

అనంతరం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాలరాసే బీజేపీ కుట్రలను దేశ ప్రజలంతా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ మనుగడ కోసం బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ద్వారా గాంధీజీ, అంబేద్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని వంశీచంద్ రెడ్డి కోరారు. బీజేపీ గాంధీజీని విస్మరించి గాడ్సె వారసులను ప్రోత్సహిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన రాష్ట్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయాలను దేశ ప్రజలంత హర్షిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలతో దేశ ప్రజలంత తెలంగాణ వైపు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ విపక్షాల విష ప్రచారాలు, కుట్రలను కాంగ్రెస్ శ్రేణులు ఎండగడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. అమిత్ షా రాజ్యాంగాన్ని అవహేళన చేసేలా మాట్లాడడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, మాజీ ఛైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యాటనర్సింహ్మా, జగన్, మానయ్య, ప్రభాకర్‌రెడ్డి, బీచ్యానాయక్, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మోతీలాల్, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితవిజయ్, నాయకులు మండ్లీ రాములు, గుర్రం కేశవులు, పర్వత్ రెడ్డి, చేగూరి వెంకటయ్య, బీక్యనాయక్, అంజన్ రెడ్డి, షాబోద్దీన్, అంజయ్య, శ్రీశైలం, శ్రీకాంత్, అలీం, ఫరీద్, మహేశ్, రాములు, బాల్‌రాజ్, రమణారెడ్డి, బోసు రవి, రాజేశ్, ఖలీల్, ఖాదర్, సంజీవ్ యాదవ్, పర్వతాలు, ప్రసాద్, గుద్దేటి శ్రీను, శంకర్, రామకృష్ణ, తులసీరామ్ నాయక్, జగన్, మల్లేశ్‌నాయక్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ శోభాయాత్రకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రేపు(శనివారం) చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రకు హిందువులు పెద్దఎత్తున తరలిరావాలని డీలర్ మైపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎన్కెపల్లిలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. నర్సింహరెడ్డి, అనిల్, నర్సింలు, రుక్కయ్య, సత్తయ్య, లింగంగౌడ్, మహేందర్, నవీన్, రాజు, శ్రీకాంత్, కర్నకర్ ఉన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

షాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దేవాలయం నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట నారాయణగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని హైతాబాద్‌లో నూతనంగా రామలయం నిర్మాణం చేస్తున్నారు. గ్రామానికి చెందిన శ్రీరామ్, రాఘవేందర్‌లు రూ.50వేల విరాళం అందించారు. గౌడసంఘం నాయకులు శేఖర్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాజుగౌడ్, సత్యనారాయణగౌడ్, నరేష్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా హాజరై బీజేపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బీజేపీ విజయాలను గు ర్తు చేసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.